www.prajasakti.com

# ప్రజాశక్తి

బుధవారం 19 మార్చి 2025 5

పశ్చిమ గోదావరి

## 22న మెగా జాబ్‌మేళా

**ఆకివీడు:** స్థానిక యువతీ, యువకులకు ఉద్యోగావకాశాల కల్పనలో భాగంగా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో దుంపగడప వివి.గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 22న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ తెలిపినట్లు కళాశాల ప్రణాళికాభివృద్ధి విభాగం కార్యదర్శి డాక్టర్ బలరాం ప్రతాప్ కుమార్ చెప్పారు. ఈ జాబ్‌మేళాలో మోహన్ స్పిన్నింగ్, ఇండస్ ఇండ్ బ్యాంకు, ముత్తూట్ ఫైనాన్స్, అరబిందో ఫార్మా, సూర్యమిత్ర ఎగ్జిమ్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ కంపెనీలతోపాటు మరికొన్ని కంపెనీలు పాల్గొంటాయన్నారు. వీటిలో ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, సూపర్‌వైజర్, ఫార్మా అసిస్టెంట్, మెషిన్ ఆపరేటర్, లోన్ ఆఫీసర్ మొదలైన ఉద్యోగావకాశాలుంటాయని వివరించారు. వివిధ కంపెనీల్లో మొత్తం 500కుపైగా ఉద్యోగావకాశాలు కల్పిస్తారని తెలిపారు. 18-35 సంవత్సరాల వయస్సు కలిగిన యువతీ యువకులు అర్హులని వివరించారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# 'బీమా' పరిహాసం..!

**అధికారం చేపట్టి పది నెలలైనా అమల్లోకి రాని చంద్రన్న బీమా**

**ఇంటి పెద్దదిక్కును కోల్పోయి రోడ్డున పడుతున్న కుటుంబాలు**

**మేనిఫెస్టోలో ఇచ్చిన హామీకే దిక్కులేని దుస్థితి**

**సాధారణ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదానికి రూ.పది లక్షలని హామీ**

**గతేడాది మార్చి నుంచి ఇప్పటి వరకూ చిల్లిగవ్వ ఇవ్వని పరిస్థితి**

**దిక్కుతోచని స్థితిలో మూడు వేలకుపైగా పేద కుటుంబాలు**

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం పేదలకిచ్చిన ప్రధాన హామీ చంద్రన్న బీమా అమలుకు నోచుకోని పరిస్థితి నెలకొంది. అధికారం చేపట్టి పది నెలలు గడిచినా బీమా అమలుపై పాలకులు నోరు మెదపడం లేదు. దీంతో ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన పేద కుటుంబాలు రోడ్డున పడుతున్న పరిస్థితి ఉంది. చంద్రన్న బీమా కోసం బాధిత కుటుంబాలు సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నాయి. 2014-19 కాలంలో టిడిపి ప్రభుత్వం చంద్రన్న బీమా పథకాన్ని తీసుకొచ్చింది. కుటుంబం ఇంటి పెద్దను కోల్పోతే సహజ మరణమైతే రూ.రెండు లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.ఐదు లక్షలు ఇచ్చేవిధంగా బీమా పథకాన్ని తెచ్చారు. ఈ పథకం ఎన్నో కుటుంబాలకు ఊరటనిచ్చిందని చెప్పొచ్చు. కష్టకాలంలో పేద కుటుంబాలకు అండగా నిలిచింది. 2019లో అధికారంలోకొచ్చిన వైసిపి ప్రభుత్వం దీనిపేరు మార్చి వైఎస్ఆర్ బీమాగా దీన్ని అమలు చేసింది. సహజ మరణానికి ఇచ్చే సొమ్ము రూ.రెండు లక్షల నుంచి రూ.లక్షకు తగ్గించింది. ప్రమాద మరణానికి మాత్రం రూ.ఐదు లక్షలు ఇచ్చేలా అమలు చేసింది. 2021-22లో ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన 1,550 కుటుంబాలకు, 2022-23లో 1,610 కుటుంబాలకు, 2023-24లో 1,119 కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా కింద ప్రభుత్వం సొమ్ము అందించింది. 18 నుంచి 50 ఏళ్లలోపు వయస్సు ఉన్న మృతులకు మాత్రమే వైఎస్ఆర్ బీమాకు అర్హులుగా తీసుకునేవారు. దీంతో 50 ఏళ్లు దాటిన ఇంటి పెద్దను కోల్పోయిన కుటుంబాలకు బీమా పరిహారం అందకుండా పోవడం అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైంది. అయినప్పటికీ ఆ ప్రభుత్వం పట్టించుకోలేదు.

**మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ అమలేది..?**

గత ఎన్నికల్లో తాము అధికారంలోకి వస్తే చంద్రన్న బీమా మళ్లీ అమల్లోకి తెస్తామని కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు సహజ మరణానికి రూ.ఐదు లక్షలు, ప్రమాద మరణాలకు రూ.పది లక్షలు బీమా పరిహారం ఇస్తామని కూటమి తమ మేనిఫెస్టోలో పెట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి పది నెలలు గడిచిపోయింది. ఇప్పటి వరకూ చంద్రన్న బీమా అమలుకు నోచుకోని పరిస్థితి. చంద్రన్న బీమాకు సంబంధించి ఎటువంటి గైడ్‌లైన్స్‌నూ ఇప్పటి వరకూ విడుదల చేయలేదు. గత ప్రభుత్వంలో వైఎస్ఆర్ బీమా కింద నమోదైన మరణాలను బట్టి చూస్తే రెండు జిల్లాలో ఏడాదికి మూడు వేల మరణాల వరకూ ఉంటున్న పరిస్థితి. గతేడాది ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన మార్చి నుంచి ఇప్పటి వరకూ ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన ఏఒక్క కుటుంబానికీ బీమా పరిహారం అందలేదు. కుటుంబాన్ని నడిపించే పెద్ద లేకపోవడంతో ఆ ఇంటి మహిళలు పిల్లలతో కుటుంబాన్ని నెట్టుకురాలేక ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చంద్రన్న బీమా అమల్లోకి వచ్చి ఉంటే ఆ కుటుంబానికి కొంత ఆర్థిక సాయం అందేది. కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబీకులు చంద్రన్న బీమా ఎప్పుడు వస్తుందని సచివాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇంకా ప్రభుత్వం విధివిధానాలు విడుదల చేయలేదని, వచ్చిన తర్వాతే ఆన్‌లైన్ చేయడం కుదురుతుందని ఉద్యోగులు చెబుతుండటంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఇలాగైతే చంద్రన్న బీమా ఎప్పటికి అమలు చేస్తారని అంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిరుపేద కుటుంబాలకు ఆసరాగా నిలిచే చంద్రన్న బీమా పథకం అమలులో ప్రభుత్వం ఎందుకు తాత్సారం వహిస్తుందో ఏఒక్కరికీ అర్థం కావడం లేదు. ప్రభుత్వం వెంటనే చంద్రన్న బీమాను అమల్లోకి తీసుకురావాలని జనం కోరుతున్నారు.

కొడమంచిలిలో వరిచేలపై పొగ మంచు

# వరికి మంచు ముప్పు..!

**ఆందోళనలో రైతులు**

ప్రజాశక్తి - ఆచంట

కొన్ని రోజులుగా అర్ధరాత్రి నుంచి ఉదయం వరకూ ఎన్నడూ లేనివిధంగా పొగమంచు కమ్ముకోవడంతో అటు వాహనదారులతోపాటు వరి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 10,300 ఎకరాల్లో దాళ్వా సాగు చేశారు. అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు కురుస్తున్న మంచు రైతులను వణికిస్తోంది. ప్రస్తుతం వరిచేలు పొట్ట, ఈనిక దశలో ఉన్నాయి. పొగమంచు కారణంగా పంట తెగుళ్ల బారిన పడి దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఒకపక్క పగటి ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్న వేళ మంచు దట్టంగా కురవడంతో జనం ఆందోళన చెందుతున్నారు.

జల్లికాకినాడలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సత్యనారాయణ

## 'హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో'ను సద్వినియోగం చేసుకోవాలి

**కలెక్టర్ చదలవాడ నాగరాణి**

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురంలో నిర్వహించే 'హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో'ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. న్యూఢిల్లీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఫర్ హ్యాండీక్రాఫ్ట్స్ వారి ఆధ్వర్యంలో నరసాపురంలో నిర్వహించనున్న 'హ్యాండీ క్రాఫ్ట్స్ ఎక్స్‌పో'ను ప్రజలు తిలకించాలని కలెక్టర్ తెలిపారు. మనం వివిధ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించే వస్తు, వస్త్ర ప్రదర్శనలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. మార్చి 21 నుంచి 25వ తేదీ వరకూ ఉదయం 11 గంటల నుండి రాత్రి 8 గంటల వరకూ నరసాపురం రుస్తుంబాద కొత్త కాలవ రోడ్డులోని ఇంటర్నేషనల్ లేస్ ట్రేడ్ సెంటర్ వద్ద 'హ్యాండీ క్రాఫ్ట్స్ ఎక్స్ పో'ను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ఎక్స్ పోలో దేశంలో ప్రసిద్ధిగాంచిన హ్యాండీ క్రాఫ్ట్స్, ఫ్యాషన్ జ్యూయిలరీ, గృహోపకరణాలు, హోమ్ ఫర్నిషింగ్, లేసు ఉత్పత్తులు, కలంకారీ శారీస్, ఫ్యాషన్ హ్యాండ్ బ్యాగ్స్, రెడీమేడ్ వస్త్రాలు, తదితర వస్తువుల ప్రదర్శన, అమ్మకం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మొగల్తూరు పూర్వపు సబ్ రిజిస్ట్రార్ వీరభద్రరావుపై సస్పెన్షన్ వేటు

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తూ డిఐజి కార్యాలయానికి డిప్యూటేషన్‌పై నియమితులైన ఎం.వీరభద్రరావును ఆ శాఖాధికారులు మంగళవారం సస్పెండ్ చేశారు. దీనికి సంబంధించి జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వీరభద్రరావు మొగల్తూరు సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తూ సుమారు నెల రోజుల క్రితం డిఐజి కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. మొగల్తూరులో విధులు నిర్వహించిన సమయంలో 1బి, అడంగల్ లేకుండా రిజిస్ట్రేషన్లు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీనిపై డిఐజి ఆదేశాల మేరకు విచారణ చేసి ప్రాథమిక నివేదిక అందించామన్నారు. దీనిపై వీరభద్రరావును డిఐజి సస్పెండ్ చేశారని వెంకటేశ్వర్లు తెలిపారు.

వీరభద్రరావు

## ఉపాధి పనుల ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలి

**ఎపి వ్యకాస జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ**

ప్రజాశక్తి - గణపవరం

ఉపాధి హామీ కార్మికులకు పేస్లిప్‌లు, సమ్మర్ అలవెన్సులు, పని ప్రదేశాల్లో సౌకర్యాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం జల్లికాకినాడలో ఉపాధి హామీ కూలీలు పని ప్రదేశాల్లో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, మండల కార్యదర్శి సోడదాసి సంజీవరావు మాట్లాడుతూ పని కావాలని అడిగిన వారందరికీ పనులు కల్పించాలన్నారు. కొత్త జాబ్ కార్డులను ఇవ్వాలని, కూలీలకు కనీస వేతనం రూ.ఆరొందలు ఇవ్వాలని అన్నారు. రెండొందల రోజులు పని దినాలు చూపించాలన్నారు. కూలీల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జల్లికాకినాడలో పంచాయతీ తాగునీరు ఫిల్టర్ చేయకుండా సరఫరా చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని కూలీలు వాపోతున్నారన్నారు. తక్షణం ఫిల్టర్ చేసిన నీరే అందించాలని కోరారు. కార్యక్రమంలో పివిఆర్.సుబ్రహ్మణ్యం, కె.రామచంద్రరావు, కేతా భవానీ, కౌరు సరస్వతి, నేతల సూర్యారావు, బాతు మరియమ్మ, బాతు చిట్టెమ్మ, కేతా శ్రీనువాసు పాల్గొన్నారు.

## ఎస్‌సి వర్గీకరణ నిరసిస్తూ ధర్నా

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎస్‌సి వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల సంఘాల జెఎసి ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు కోనా జోసెఫ్, చీకటిపల్లి మంగరాజు, గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం కేబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామని, వెంటనే ఆ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మీసాల జైరాజ్, కేసి రాజు మాట్లాడుతూ మిశ్రా అన్ని జిల్లాల్లో తిరిగి ప్రభుత్వ రిజిస్ట్రేషన్ సంస్థలను రమ్మని పిలిచారని, ఆ రిపోర్ట్‌నే ప్రభుత్వానికి ఇచ్చి తప్పుడు సంకేతం అందించారని ఆరోపించారు. దీనికి నిరసనగా ఈ నెల 20న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ ఆందోళనలో ఈది రవికుమార్, బేతాళ కమలాకర్, గాతల సందీప్, గొల్ల రాజ్ కుమార్, అంబటి ఆనంద్ కుమార్, పట్టెం శుభకర్, కొండేటి లాజర్, బండి మధు తదితరులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న నేతలు

## అర్హులైన రైతులకు రూ.20 వేల సాయం

**జెడ్‌పి ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ**

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం అమలు ద్వారా అర్హులైన రైతులకు రూ.20 వేల ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. ఏలూరులోని జిల్లా పరిషత్ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం జిల్లా వ్యవసాయ, ఉద్యానవన శాఖాధిపతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, పిఎం కిసాన్ పథకం అమలు ద్వారా అర్హులైన రైతుకు 20 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అదేవిధంగా అర్హులైన ప్రతి రైతుకు లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు యంత్రాల సబ్సిడీ ద్వారా ట్రాక్టర్లు, హార్వెస్టర్లు, డ్రిప్ ఇరిగేషన్ లాంటివి అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, దీనిపై రైతులలో అవగాహన పెంచాలని ఆదేశించారు. ఉచిత పంట బీమా అమల్లో భాగంగా రైతుల నమోదు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైతులకు అదనపు ఆదాయం కల్పించేందుకు వ్యవసాయ పనులను ఎంజిఎన్ఆర్ఇజిఎస్ కింద తీసుకుని తక్కువ ఖర్చుతో వ్యవసాయం చేయడానికి రైతులకు తోడ్పడుతుందని, ఈ పథకాన్ని మరింత విస్తృతంగా అమలు చేయాలని సూచించారు. మట్టి శుద్ధి పరీక్షలు నిర్వహించి సాయిల్ హెల్త్ కార్డ్సని పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఎరువుల సరఫరా, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించే చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. పండ్ల తోటలు, పూల తోటల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుంది కాబట్టి ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు సబ్సిడీలు అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులు తగిన ధర పొందేందుకు కోల్డ్ స్టోరేజ్, రైతు బజార్ వ్యవస్థలను మెరుగుపరిచేలా ప్రభుత్వం కృషిచేస్తుందని తెలిపారు. జిల్లాలోని రైతులకు ప్రతి పథకం అమలును క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతుల వద్ద నుంచి నేరుగా ఫీడ్‌బ్యాక్ తీసుకోవడం, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖ అధికారులు, మండల వ్యవసాయాధికారి, హార్టికల్చర్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## స్పాట్ విధుల నుంచి కొంతమందిని మినహాయించాలి

**డిఇఒకు యుటిఎఫ్ నేతల వినతి**

ప్రజాశక్తి - భీమవరం

ఏప్రిల్ మూడో తేదీ నుండి ప్రారంభమయ్యే పదో తరగతి స్పాట్ వాల్యూయేషన్ విధులకు సంబంధించి కొంతమందిని మినహాయించాలని యుటిఎఫ్ జిల్లా కమిటీ కోరింది. స్థానిక కలెక్టరేట్లో డిఇఒ నారాయణకు ఈ మేరకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారిని, గర్భిణులు, బాలింతలను, 60 ఏళ్లు నిండిన వారిని స్పాట్ వాల్యూయేషన్ విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. డిఇఒను కలిసిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, అసోసియేట్ అధ్యక్షులు కె.రాజశేఖర్, కోశాధికారి పి.క్రాంతికుమార్, కార్యదర్శులు సిహెచ్.కుమార్‌బాబ్జి, జి.రామకృష్ణంరాజు, కెఎస్.రామకృష్ణ ప్రసాద్, డి.ఏసుబాబు, పి.శివప్రసాద్, పాలకోడేరు మండల ప్రధాన కార్యదర్శి కౌరు త్రిమూర్తులు ఉన్నారు.

డిఇఒకు వినపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

## మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం తగదు

**డ్వామా పీడీ సిహెచ్.అప్పారావు**

ప్రజాశక్తి - గణపవరం

ఉపాధి హామీ కింద మొక్కల పెంపకంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని డ్వామా పీడీ సిహెచ్.అప్పారావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో రూ.30 వేల వ్యయంతో నాటిన మొక్కలపై సరైన పర్యవేక్షణ లేక అవన్నీ చనిపోయాయన్నారు. మళ్లీ మొక్కలు నాటి నివేదిక పంపాలని ఆదేశించారు. ఉపాధి హామీ పనులు క్రియాశీలకంగా చేయాలని అధికారులకు సూచించారు. మండల టిఎడి సురేందర్ మాట్లాడుతూ మండలంలో 25 గ్రామాల్లో జరిగిన ఉపాధి పనులను వివరించారు. ఈ సభలో డివిఒ పురుషోత్తం అంబుడ్స్‌మేన్ జి.ఆదినారాయణ, సోషల్ ఆడిట్ ఎస్ఆర్‌పి గోవింద్, ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మీ ఇఒపిఆర్‌డి పి.సత్యనారాయణ, కూటమి నాయకులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఆశా కార్యకర్త మృతి

ప్రజాశక్తి - ఉండి

ఉండి మండలం వాంద్రం గ్రామానికి చెందిన ఆశా కార్యకర్త తేలి మాలతి (39) అనారోగ్యంతో మృతి చెందారు. దీనికి సంబంధించి సహచర ఆశా కార్యకర్తలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాలతి కొంతకాలంగా అనారోగ్యానికి గురి కావడంతో ఇటీవల తన పుట్టిల్లు భీమవరం మండలం వెంపలో ఉంటున్నారని, మంగళవారం మృతి చెందడంతో వాంద్రం తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారని తెలిపారు. 2006 నుంచి ఆశా కార్యకర్తగా పని చేస్తున్న ఆమె గ్రామంలో అందరికీ అందుబాటులో ఉంటూ మన్ననలు పొందిందని, ఆమె మృతి పట్ల సంతాపం, కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాలతి కుమారుడు తొమ్మిదో తరగతి చదువుతున్నాడని, ఆమె కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలబడాలని వారు కోరారు.

ఆశా కార్యకర్త మాలతి (ఫైల్‌ఫొటో)

# రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలి ఎపి రజక వృత్తిదారుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మంగళవారం భీమవరంలోని 18వ వార్డు పేరంటాలమ్మ చెరువు రజక కమ్యూనిటీ హాల్ వద్ద చర్చా వేదిక సంఘం జిల్లా కార్యదర్శి మడక రాజు అధ్యక్షతన నిర్వహించారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నూరు భాస్కరయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 25 లక్షల మంది రజకులు నివసిస్తున్నారని తెలిపారు. స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు పూర్తవుతున్నా రజకులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఇప్పటికీ అణచి వేతకు గురవుతున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వెంటనే వివిధ ప్రజా సంఘాలు, కుల సంఘాలతో చర్చించి రజకులకు సామాజిక రక్షణ చట్టం వెంటనే ఏర్పాటు చేయాలని, వృత్తి చెరువులపైన రజకులకే పూర్తి హక్కు కల్పించాలని, 50 సంవత్సరాలు పూర్తయిన రజకులకు పెన్షన్ సౌకర్యం ఏర్పాటు చేయాలని, జిఒ 26 ప్రకారం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న దోబీ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఏప్రిల్ 20, 21వ తేదీల్లో జరిగే సంఘం రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ ఈ చర్చా వేదిక కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాయల మాల కొండయ్య, ఆవుల మంద రవణమ్మ, యండమూరి నాగేంద్ర, పి.అర్జున్ రావు, అమ్మా రావు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడుకు యర్రంశెట్టిపాలెం గ్రామ మాజీ సర్పంచి కూనపరెడ్డి వీర వెంకట విజయ రంగారావు మంగళవారం వినతిపత్రం అందజేశారు. మంగళవారం పట్టణంలోని ఏడో వార్డులో కొవ్వలి నాయుడు స్వగృహంలో కొవ్వలి రామ్మోహన్ నాయుడును రంగారావు కలిశారు. యర్రంశెట్టిపాలెం పంచాయతీ పితానిమెరక నుంచి మేడిదివారిమెరక వరకూ 2019లో రూ.2.42 కోట్లతో రోడ్డుకు శంకుస్థాపన చేశారే తప్ప ఇప్పటివరకూ రోడ్డు నిర్మాణ పనులు జరగలేదని, వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టేందుకు కృషి చేయాలని కోరారు. ఆక్వా రైతులు పండించే పంటను తీసుకువెళ్లేందుకు రుస్తుంబాద గ్రామం మైలాబత్తుల శ్రీనివాస్ ఇంటి నుంచి సెవెంత్ డే స్కూల్ వరకూ పుంతగట్టు దారి అధ్వానంగా ఉందని, వెంటనే కొత్త రోడ్డు నిర్మాణ పనులు జరిపి రైతులకు అండగా నిలవాలని తెలిపారు. నర్సాపురం మున్సిపాల్టీ డ్రెయినేజీ, మురుగునీరు, వ్యర్థాలను రుస్తుంబాద మురుగు కాలువలోకి మళ్లించడం వల్ల, సార్వా, దాళ్వా పంటలు ముంపునకు గురై ఆరేళ్లుగా ఊడ్చడం లేదన్నారు. అదేవిధంగా ఈ మురుగు కాలువ ఆక్రమణలకు గురవ్వడం వల్ల, నీటి పారుదల జరగడం లేదని రంగారావు ఆవేదన వ్యక్తం చేశారు. మురుగు కాలువ ఆక్రమణలు తొలగించి, నర్సాపురం మున్సిపాల్టీ ప్రజల మురుగు నీరు, వ్యర్థాలు మురుగు కాలువలో కలవకుండా చర్యలు తీసుకునేలా కృషి చేయాలని కొవ్వలి రామ్మోహన్ నాయుడుకు రంగారావు తెలిపారు.



కొవ్వలి నాయుడుకు వినతిపత్రం అందిస్తున్న రంగారావు

# ప్రకృతి వ్యవసాయంతో నవధాన్యాలు సాగు చేయాలి

## వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అనిల్‌కుమారి

ప్రజాశక్తి - యలమంచిలి

ప్రకృతి వ్యవసాయం ద్వారా నవధాన్యాల పంటలు పండించాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు అనిల్‌కుమారి తెలిపారు. మండలంలోని మేడపాడు రైతు సేవా కేంద్రం వద్ద మంగళవారం మండలస్థాయి కన్వెర్జెన్సీ సమావేశం ప్రకృతి వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో వెలుగు డిపార్ట్మెంట్ నుంచి డ్వాక్రా యానిమేటర్లు వ్యవసాయ శాఖ నుంచి విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నరసాపురం వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఇ.అనిల్‌కుమారి మాట్లాడుతూ రైతులు పెట్టుబడులు తగ్గించుకొని ప్రకృతి వ్యవసాయంలో రబీ కోతల సమయంలో ప్రతి రైతూ తమ పొలాల్లో 30 రకాలు నవ ధాన్యాలు వేసుకుని, భూమిలో నత్రజని పెరిగేందుకు నీటి ఎద్దడితో పాటు కలుపు నివారణకు ఎంతగానో ఉపయోగపడుతుందని వివరించారు. డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఎం.అరుణకుమారి మాట్లాడుతూ వరిలో రోగ నిరోధక శక్తి పెంపొందించేందుకు పకృతి వ్యవసాయం ప్రధానమన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా 365 రోజులు భూమిని కప్పి ఉంచడం వల్ల భూమిలో తేమ శాతం నిల్వ ఉంటుందన్నారు. భూసారం పెంచేందుకు ద్రవ, ఘన జీవామృతం వాడి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులను తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎడిఎ అనిల్ కుమారి, మండల వ్యవసాయాధికారి సిహెచ్.దేవి, వెలుగు ఎపిఎం.సతీష్‌కుమార్, ప్రకృతి వ్యవసాయ జిల్లా కో ఆర్డినేటర్ ఎం.అరుణకుమారి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి అనిల్‌కుమారి

## సౌకర్యాల కల్పన ప్రభుత్వం బాధ్యత : సిపిఎం

**ప్రజాశక్తి - గణపవరం**

గ్రామాల్లో ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, అయితే ఆ బాధ్యతను మరచి గ్రామాభివృద్ధికి దాతలు ముందుకు రావాలని ఎంఎల్ఎ చెప్పడం విడ్డూరంగా ఉందని సిపిఎం మండల కమిటీ అభిప్రాయపడింది. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కేశవరం బెయిలీ వంతెనకు మరమ్మతులు చేయాలని పార్టీ ఆధ్వర్యాన ఆందోళనలు చేసినా స్థానిక ఎంఎల్ఎ స్పందించలేదని తెలిపారు. అయితే ప్రవాసాంధ్రులైన దండు సత్యనారాయణ రాజు (బోస్ రాజు) ఇచ్చిన రూ.పది లక్షలతో వంతెనకు మరమ్మతులు చేశారని తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రభుత్వ నిధులు కేటాయించాలని, దీనికి ఎంఎల్ఎ కృషి అవసరమని కమిటీ కోరింది. ప్రజలు ఇబ్బందులు పడకుండా చేసిన బోస్ రాజు దాతృత్వానికి సిపిఎం మండల కమిటీ అభినందనలు తెలిపింది. అభినందనలు తెలిపిన వారిలో సిపిఎం మండల కార్యదర్శి పెన్మెత్స నరసింహమూర్తి, సభ్యులు నరాలశెట్టి రామకృష్ణ, మేడిశెట్టి వెంకటరావు, కేతా శ్రీనివాస్, నాగేశ్వరరావు, సోడదాసి సంజీవరావు తదితరులు ఉన్నారు.

## పంట నమోదు ప్రక్రియ వేగవంతం

### వ్యవసాయ శాఖ అధికారి జ్యోషిలా

**ప్రజాశక్తి - పెనుమంట్ర**

మండలంలోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఈ పంట నమోదు కార్యక్రమం వేగవంతంగా జరుగుతోందని ఆ శాఖ మండల అధికారి అడబాల జ్యోషిలా మంగళవారం తెలిపారు. మండల పరిధిలో 12,120 ఎకరాలకు గాను 6,547 మంది రైతులు నమోదైనట్లు పేర్కొన్నారు. సామాజిక తనిఖీలో భాగంగా అన్ని గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో రైతుల జాబితాను, పంటలను ప్రదర్శించడం జరిగిందని, ఆయా గ్రామాల్లోని రైతులందరూ ఒకసారి వారి వివరాలను సరి చూసుకోవాలని వ్యవసాయ అధికారి కోరారు. ఈ ప్రక్రియ ఈ నెల 22వ తేదీ వరకూ కొనసాగుతుందన్నారు. అలాగే ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోని రైతులు వెంటనే గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి ఆ ప్రక్రియలో పాల్గొని, రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆమె కోరారు.

## రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

**ప్రజాశక్తి - ఆకివీడు**

రైతులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పండించిన పంట చేతికొచ్చే సమయం ఆసన్నమైందని, ఈ సమయంలో జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు రైతులకు సూచించారు. మంగళవారం కుప్పనపూడిలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఎంఆర్పి ప్రియాంక ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు చల్లారావు పొలం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పంట కోతకు వచ్చిన సమయంలో తెగుళ్లు ఆశించడం, ఇతరత్రా నష్టాలు ఉంటాయని, ఈ నేపథ్యంలో రైతులు జాగరూకతతో వ్యవహరించాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలను గమనిస్తూ కోతలకు సిద్ధమవ్వాలన్నారు. అనంతరం ఎన్ఎల్ఆర్ 3238 రకం విత్తనాల వెరైటీని పరిశీలించారు. వీటిలో జింక్ ధాతువు అధికంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎడిఎ ఎ.శ్రీనివాసరావు, మండల వ్యవసాయ అధికారి ఎంఆర్పి.ప్రియాంక, వి.వి.లావణ్య, రైతులు పాల్గొన్నారు.

## వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటన

**ప్రజాశక్తి - నరసాపురం**

పట్టణంలో పలు వార్డుల్లో మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య సిబ్బందితో పలు వార్డుల్లో పర్యటించి పారిశుధ్య పనులను తనిఖీచేశారు. ఆయా వార్డుల్లో లోపాలు జరగకుండా పక్కాగా నిర్వహించాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని సూచించారు. ఇంటి, తాగునీటి, కుళాయి పన్నులు వసూలుపై మున్సిపల్ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పట్టణంలో ఏ అభివృద్ధి పని చేపట్టాలన్నా పన్నుల వసూలు కీలకమన్నారు. నూరు శాతం పన్నుల వసూలుకు సచివాలయాల్లోని వార్డు కార్యదర్శులు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంద్ర ప్రసాద్. పాత్రుడు రెవెన్యూ అధికారులు అడబాల నానాజీ, డిఇ ప్రవీణ్ చంద్ర పాల్గొన్నారు.

## బాధితులకు ధర్మారావు ఫౌండేషన్ చేయూత

**ప్రజాశక్తి - యలమంచిలి**

బాధితులకు సాయం అందజేస్తున్న సభ్యులు

మండలంలోని గుంపర్రు గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన గ్రామానికి చెందిన అయినవిల్లి ఆనందరావుకు సంబంధించి రెండు కుటుంబాల వారికి జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు తండ్రి పేరుతో స్థాపించిన ధర్మారావు ఫౌండేషన్ ద్వారా మంగళవారం నిత్యావసరాలు, వంట సామగ్రి, బియ్యం, దుస్తులు తదితర వస్తువులు ఫౌండేషన్ సభ్యులు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మామిడిశెట్టి పెద్దిరాజు, నాయకులు బోనం నాని, చిట్టూరి ఆంజనేయులు, జడ్డు రాజేష్, మాజీ సర్పంచి శేషగిరి, దీప్తి అప్పారావు, పీతల శీను పాల్గొన్నారు.

## ఎంఆర్‌పికే మద్యం విక్రయించాలి

**ప్రజాశక్తి - నరసాపురం**

వైన్ షాపుల్లో మద్యం ఎంఆర్‌పి ధరలకే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు ఇంజేటి కుమారస్వామి కోరారు. మంగళవారం నరసాపురం ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. మండలంలోని వైన్‌షాపుల్లో బాటిల్‌పై 20 రూపాయల అదనంగా అమ్మకాలు సాగిస్తున్నారని, గ్రామాల్లో ఇష్టారాజ్యంగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేస్తున్నారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

## మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ర్యాలీ

**ప్రజాశక్తి - పాలకొల్లు**

పాలకొల్లు ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలలో కాలేజీ ఈగల్ క్లబ్, డ్రగ్ ఫ్రీ రాష్ట్ర కమిటీ సంయుక్త నిర్వహణలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథి కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి మాట్లాడుతూ మత్తు పదార్థాలు, ధూమపానం, మద్యపానం మొదలైన వాటిని దూరంగా పెట్టి యువత మంచి నడవడికతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 వాలంటీర్లు, విద్యార్థులచే అందరికీ అవగాహన వచ్చే విధంగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈగల్ క్లబ్ కమిటీ కన్వీనర్లు ఎం.రామకృష్ణ, ఎ.వంశీ సుబ్బరాయన్, వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, అకడిమిక్ కోఆర్డినేటర్ యామిని, ఐక్యూఎసి కోఆర్డినేటర్ కె.భద్రాచలం పాల్గొన్నారు.

## 'నవధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలి'

**ప్రజాశక్తి - నరసాపురం**

అన్నదాతలు రబీ కోతల సమయంలో ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించి 30 రకాల నవధాన్యాలను సాగుకు కృషి చేయాలని ప్రకృతి వ్యవసాయం జిల్లా సమన్వయకర్త ఎం.అరుణకుమారి అన్నారు. డ్వాక్రా మండల సమాఖ్య భవనంలో మంగళవారం జరిగిన వ్యవసాయ శాఖ, డ్వాక్రా యానిమేటర్ల అవగాహనా సమావేశంలో ఆమె మాట్లాడారు. నవధాన్యాలను సాగు చేయడం ద్వారా భూమిలో నత్రజని శాతం పెరగడంతోపాటు నీటి ఎద్దడి సమస్యను అధిగమించొచ్చని అరుణకుమారి తెలిపారు. కలుపు నివారణకు ఎంతగానో దోహదం చేస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయం వల్ల 356 రోజులు భూమిని కప్పి ఉంచడం ద్వారా భూమిలో తేమ శాతం అధికంగా ఉంటుందన్నారు. వెలుగు ఎపిఎం జక్కంపూడి నాగభూషణంనాయుడు మాట్లాడుతూ నవధాన్యాలను సాగు చేసేందుకు డ్వాక్రా మహిళలకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎడిఎ ఇ.అనిల్‌కుమారి, ఎఒ ఎం.శామ్యూల్ జాన్సన్, ప్రకృతి వ్యవసాయ ప్రాంతీయ సమన్వయకర్త సిహెచ్.వీరాస్వామి, డివిజన్ ఇన్‌ఛార్జి ఎ.నర్సింగ్, ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది మాధవి పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి సోపానానికి దరఖాస్తు చేసుకోవాలి

**ప్రజాశక్తి - నరసాపురం**

ప్రభుత్వ ఆదేశాల మేరకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను కాపు, బిసిలకు స్వయం ఉపాధి సోపానం పథకం ద్వారా రుణ సదుపాయం కల్పించేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపిడిఒ జివిఎస్ రామకృష్ణంరాజు తెలిపారు. ఈ నెల 22వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయొచ్చన్నారు. యూనిట్ స్థాపనకు రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ బ్యాంకుల లింకేజీ రుణాలను 50 శాతం రాయితీలో అందిస్తామన్నారు. వివరాలకు ఎంపిడిఒ కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

# ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

## చెత్త నుంచి సంపద తయారీకి చర్యలు - ఇఒపిఆర్‌డి ఎంవిఎస్.రాంప్రసాద్

చిట్ చాట్

**ప్రజాశక్తి - పాలకోడేరు**

చెత్త నుంచి సంపద తయారు చేసి పంచాయతీలకు ఆదాయం సమకూర్చడంలో భాగంగా ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు మండల విస్తరణ అధికారి ఎంవిఎస్.రాంప్రసాద్ తెలిపారు. గ్రామాల్లో నిరంతరం ఇంటింటా చెత్త సేకరించి తడి, పొడి చెత్తను వేరుచేసి ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాల ద్వారా సంపద సృష్టించడం జరుగుతుందన్నారు. వీటి ద్వారా పంచాయతీలకు ఆదాయం లభించడమే కాకుండా సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ఎంతో దోహదపడుతుందని చెప్పారు. మండలంలో ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాల నిర్వహణ, తాగునీటి సరఫరా, పన్నుల వసూలు, నాన్ లేఅవుట్లు, తాగునీటి పథకాలు తదితర అంశాలపై ప్రజాశక్తి నిర్వహించిన చిట్‌చాట్‌లో ఇఒపిఆర్‌డి.రాంప్రసాద్ మాట్లాడారు.

**ప్రశ్న : మండలంలో ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాలు ఎన్ని ఉన్నాయి? ఏ గ్రామాల్లో ఇంకా ఏర్పాటు కాలేదు?**

మండలంలో 14 గ్రామాలు ఉన్నాయి. వాటిలో 11 గ్రామాల్లో చెత్త నుంచి సంపద తయారీ (ఎస్‌డబ్ల్యూపిసి) కేంద్రాలు ఉన్నాయి. శృంగవృక్షం, పెన్నాడ, అగ్రహారం, మోగల్లు గ్రామాల్లో ఈ కేంద్రాలు ఇంకా ఏర్పాటు చేయలేదు. పెన్నాడ అగ్రహారంలో కేంద్రం ఏర్పాటుకు గ్రామసభ నిర్వహించడం జరిగింది. మరికొన్ని రోజుల్లో ఇక్కడ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నాం.

**ప్రశ్న : వర్మీ ఏ గ్రామంలో అందుబాటులో ఉంది? కిలో ఎంత ధరకు విక్రయిస్తున్నారు?**

ఒక టన్ను చెత్త ద్వారా సుమారు 400 కేజీల వర్మీ తయారవుతుంది. ప్రస్తుతం వర్మీ విస్సాకోడేరులో అందుబాటులో ఉంది. పాలకోడేరు, కోరుకొల్లు, గొల్లలకోడేరు, వేండ్ర గ్రామాల్లోని ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాల ద్వారా మరో 15 రోజుల్లో వర్మీ అందుబాటులోకి వస్తుంది. కేజీ రూ.10 చొప్పున విక్రయిస్తున్నారు.

**ప్రశ్న : పారిశుధ్య నిర్వహణకు ఎటువంటి చర్యలు చేపట్టారు?**

ప్రతి గ్రామంలో రోజూ క్రమం తప్పకుండా ఇంటింటా చెత్త సేకరిస్తున్నాం. పారిశుధ్య సిబ్బంది తక్కువగా ఉన్నచోట ఎక్కువ మందిని పెట్టుకునే విధంగా చర్యలు చేపట్టాం. అలాగే చెత్త తీసుకెళ్లే రెక్షాలను అందుబాటులోకి తెచ్చాం. ప్రతి వార్డులో తడి, పొడి చెత్త సేకరిస్తున్నాం. సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాలకు తరలించి అక్కడ రీసైక్లింగ్ చేసి వర్మీని తయారు చేయడం జరుగుతుంది.

**ప్రశ్న: వచ్చే వేసవిలో తాగునీటి ఇబ్బందులు అధిగమించేందుకు చర్యలు చేపట్టారా?**

ఇప్పటికే తాగునీటి చెరువులను నీటితో నింపే చర్యలు తీసుకున్నాం. 15 రోజులకోసారి ఫిల్టర్‌బెడ్‌లు, వాటర్ ట్యాంకులను పిఆర్ఐ యాక్టర్ ప్రకారం శుభ్రం చేయాలని ఆదేశాలు జారీ చేశాం. విస్సాకోడేరులో అధునాతన టెక్నాలజీతో ఫ్రీట్రీట్ మెంట్ మైక్రో ప్లాంట్ ఏర్పాటుచేసి సురక్షిత నీటిని అందిస్తున్నాం. అలాగే పెన్నాడ అగ్రహారంలో మైక్రో ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు, తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నాం.

**ప్రశ్న : నాన్ లేఅవుట్లపై ఎటువంటి చర్యలు తీసుకున్నారు?**

మండలంలో పుట్టగొడుగుల్లా నాన్ లేఅవుట్లు ఉన్నాయి. వీటికి ఎటువంటి అనుమతులు లేవు. పాలకోడేరు వంటి మేజర్ పంచాయతీ పరిధిలోని నాన్ లేఅవుట్లలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. వీటిని తొలగించిన ఇద్దరు రియల్ ఎస్టేట్ వ్యాపారులపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. అక్రమంగా లేఅవుట్లు ఏర్పాటు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

**ప్రశ్న : పన్ను వసూలు ఏ విధంగా ఉంది?**

2024-2025కు సంబంధించి రూ.2 కోట్ల 80 లక్షలు ఏరియర్ ఉంది. దీనిలో ఇప్పటివరకూ సుమారు రూ. కోటీ 80 లక్షలు వసూలు చేశాం. ఈ నెల 20వ తేదీలోపు 80 శాతం, నెలాఖరులోపు నూరుశాతం పన్ను వసూలు చేసేందుకు లక్ష్యంగా తీసుకున్నాం.

## జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ నాటికగా 'చిగురు మేఘం'

**ప్రజాశక్తి - పాలకొల్లు**

బహుమతులు ప్రదానం చేస్తున్న సభ్యులు

పాలకొల్లు కళా పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో బస్టాండ్ సెంటర్లోని అడబాల థియేటర్స్ వెనుక ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన కళావేదికపై 3 రోజులపాటు వైభవంగా నిర్వహించిన జాతీయస్థాయి నాటిక పోటీల్లో అమరావతి ఆర్ట్స్ గుంటూరు వారి 'చిగురు మేఘం' నాటిక ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. పాలకొల్లు కళాపరిషత్ అధ్యక్షులు కెవి.కృష్ణ వర్మ అధ్యక్షతన సోమవారం అర్ధరాత్రి జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభ జరిగింది. సంస్థ ఉపాధ్యక్షుడు విటాకుల రమణ స్వాగతం పలుకగా మరో ఉపాధ్యక్షులు కెఎస్‌పిఎన్.వర్మ సభను ప్రారంభించారు. ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా చైతన్య కళా స్రవంతి విశాఖపట్నం వారి (అ)సత్యం నాటిక నిలిచింది. తృతీయ బహుమతి ఉషోదయ కళానికేతన్ కట్రపాడు వారి కిడ్నాప్ నాటిక సాధించింది. జ్యూరీ ప్రదర్శనగా మైత్రి కళానిలయం విజయవాడ వారి బ్రహ్మ స్వరూపం నాటిక బహుమతి సాధించింది. ఉత్తమ రచయితగా అరవింద ఆర్ట్స్ తాడేపల్లి వారి విడాకులు కావాలి నాటిక రచయిత వల్లూరు శివప్రసాద్ ప్రసాద్, ఉత్తమ దర్శకునిగా (అ)సత్యం నాటిక దర్శకుడు పి.బాలాజీ నాయక్ బహుమతి పొందారు. ఉత్తమ నటుడిగా చిగురు మేఘం నాటికలో చెన్నయ్య పాత్రధారి కావూరి సత్యనారాయణ, ఉత్తమ నటిగా ఇది రహదారి కాదు నాటికలో సముద్రాలు పాత్రధారిణి బి.నాగరాణి, ఉత్తమ ప్రతి నాయకుడిగా (అ)సత్యం నాటికలో రఘుపతి పాత్రధారి వై.అనిల్‌కుమార్ ఉత్తమ హాస్య నటునిగా మా ఇంట్లో మహాభారతం నాటికలో వాసుదేవరావు పాత్రధారి పి.పండు బహుమతులు అందుకున్నారు. అలాగే పలు కేటగిరీల్లో పలువురు బహుమతులు అందుకున్నారు. న్యాయం నిర్ణేతలుగా పంపన దయానంద బాబు, గెద్ద వరప్రసాద్, గుత్తు చిన్నారావు వ్యవహరించారు. సభాధ్యక్షులు కృష్ణవర్మ మాట్లాడుతూ పాలకొల్లు ప్రజలు, దాతలు సహాయ సహకారంతో ఈ పరిషత్‌ను దిగ్విజయంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. విజేతలకు జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ మేకా శేషుబాబు, ఎస్‌సి కమిషన్ మాజీ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, జెడ్‌పిటిసి నడపన గోవిందరాజు నాయుడు సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం బివిఆర్ కళాపరిషత్ అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు, సినీ దర్శకులు కొంగరపి వెంకటరమణ, సంస్థ గౌరవాధ్యక్షుడు మేడికొండ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎం.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పాతపాడులో పశువైద్య శిబిరం

**ప్రజాశక్తి - మొగల్తూరు**

పాతపాడులో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించామని వైద్యురాలు జి.నీలిమ తెలిపారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణలో భాగంగా ఏర్పాటు చేసిన శిబిరంలో 62 మూగ జీవాలకు వ్యాధి నివారణ టీకాలు వేశామని నీలిమ తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మనోరంజన్ పరిడాను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

## సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులకు శిక్షణ దోహదం

**భీమవరం టౌన్:** దేశంలో మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రోడ్డు వర్క్ నెట్వర్క్ సిస్టమ్ మెరుగుపర్చాలంటే సివిల్ ఇంజినీర్లు మరింతగా అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సిఎస్ఐఆర్ సిఆర్ఆర్ఐ (సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇనిస్ట్యూట్) డైరెక్టర్ మనోరంజన్ పరిడా పేర్కొన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో బి అప్లికేషన్ ఆఫ్ జియో సింథటిక్స్ ఇన్‌రోడ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ అంశంపై ఐదు రోజులపాటు జరిగే శిక్షణను డాక్టర్ ఫరీదా మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ఆర్‌అండ్‌డి డీన్ టి.వంశీ నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మనోరంజన్ పరిడా మాట్లాడుతూ సింథటిక్ రోడ్డు నిర్మాణం గురించి వివిధ డాక్యుమెంట్లను అధ్యయనం చేయాలన్నారు. దేశవ్యాప్తంగా ప్రస్తుత విద్యా సంవత్సరంలో వెయ్యి మంది విద్యార్థులకు శిక్షణ అందించాలని లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొంది నైపుణ్యం ప్రదర్శించిన వారిలో 10 శాతం మందికి ఇంటర్న్ షిప్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు వెల్లడించారు. ఏడాదికి 150 మందికి అవకాశం ఉంటుందని విద్యార్థులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. చీఫ్ సైంటిస్ట్ అండ్ ప్రాజెక్టు లీడర్ సిఎస్ఐఆర్ సిఆర్ఆర్ఐ పిఎస్‌ప్రసాద్ మాట్లాడుతూ నిరంతరం అధ్యయనం చేస్తే వినూత్నంగా మరిన్ని నిర్మాణాలు చేపట్టవచ్చని అన్నారు. ప్రిన్సిపల్ సైంటిస్ట్ అండ్ కోఆర్డినేటర్ భరత్ మాట్లాడారు.

## నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

**ప్రజాశక్తి - తణుకు రూరల్**

తణుకు మండలంలో ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకూ ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఆర్.లోహిత్ జైసాగర్ తెలిపారు. వేల్పూరు గ్రామ సచివాలయంలో 19 నుంచి 22 వరకూ, 22న దువ్వ గ్రామ సచివాలయంలో, మండపాక గ్రామ పంచాయతీలో 19 నుంచి 22వ తేదీ వరకూ, 21, 22 తేదీల్లో తేతలిలో గ్రామ సచివాలయం వద్ద క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 6 ఏళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేసుకోవాలని, పాఠశాల చదువుతున్న విద్యార్థులు వేలిముద్రలు అప్‌డేట్ చేయించుకోవాలని ఆయన సూచించారు.

**నరసాపురం :** పట్టణంలో 19 నుంచి 22వ తేదీ వరకూ వార్డు సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు. పట్టణంలోని 19 నుంచి 22 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకూ శ్రీహరి పేట, టైలర్ పేట, వీవర్స్ కాలనీ మూడు సచివాలయాల్లో క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపులను వినియోగించుకోవాలని కోరారు.

**కాళ్ల :** 0 నుంచి 6 ఏళ్లలోపు వయసు గల పిల్లలు ఉన్న తల్లిదండ్రులు ఆధార్ మొబైల్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ స్వాతి మంగళవారం తెలిపారు. మండలంలోని మాలవానితిప్ప, పెదఅమిరం, మోడీ, కాళ్ల దొడ్డనపూడి, సీసలి, ఏలూరుపాడు, ప్రాతాళ్లమెరకలో 8 చోట్ల ఆధార్ మొబైల్ క్యాంపులను ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు. బుధవారం నుంచి 8 రోజులు జరిగే ఈ క్యాంపులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## వికలాంగునికి రోటరీ క్లబ్ సాయం

**ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్**

ఆచంట మండలం పెనుమంచిలి గ్రామానికి చెందిన పేద వికలాంగుడు గంధం నాగరాజు పోలియో వల్ల నడవలేని పరిస్థితిలో ఉన్నాడు. ఈ నేపథ్యంలో మూడు చక్రాల సైకిల్ కోసం పాలకొల్లు రోటరీ క్లబ్‌ను సంప్రదించడంతో స్పందించిన రోటరీ సభ్యులు అతనికి మంగళవారం 12 వేల రూపాయలు విలువైన మూడు చక్రాల సైకిల్ నాగరాజుకు అందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రెసిడెంట్ రావాడ సతీష్, కార్యదర్శి జవ్వాజి కళ్యాణ్, కోశాధికారి పోతాబత్తుల సత్యనారాయణ, క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్‌లు పాల్గొన్నారు.

**CHANGE OF NAME**

**KULSAM ABEDA SULTANA** (Old name), W/o SHAIK AHAMMAD ALI, D.NO: 3-27, MAIN ROAD, PENUGONDA Village, PENUGONDA Mandal, West Godavari District, Pincode-534320, I have changed my name as **KULSUM ABEDA SULTANA** (New Name), hereafter my name is known as **KULSUM ABEDA SULTANA** (New Name).

**పాస్‌పోర్టు పోయినది**

పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం దొంగరావి పాలెం గ్రామానికి చెందిన చింతా రవిబాబు తండ్రి సత్యనారాయణ అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. దొంగరావుపాలెం ఇంటి దగ్గర నుండి సిద్ధాంతం నెట్ సెంటర్ కు వెళుతుండగా నా యొక్క పాస్ పోర్ట్ నంబర్ : L5020463 గల పాస్ పోర్ట్ ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్కు తెలియజేయగలరు.

అడ్రస్ : **చింతా రవిబాబు,** తండ్రి : సత్యనారాయణ
మెయిన్ రోడ్, దొంగరావిపాలెం
పెనుగొండ మండలం, ప.గో.జిల్లా.
పిన్ : 534330, సెల్ : 8143176209

**పాస్ పోర్ట్ పోయినది**

ఏలూరు జిల్లా నూజివీడు మండలం నూజివీడు పట్టణంలోని డోర్ నెంబర్ 24 - 112 లో కాపురస్తులు పంద్రంగి నీరజ్ పవన్ కుమార్ S/o.పంద్రంగి కృష్ణమోహన్ అను నా యొక్క ఒరిజినల్ పాస్ పోర్ట్ పోయినది. V2804169 నంబర్ గల పాస్ పోర్ట్ పోయినది. ది 16/03/2025 వ తేదీన నూజివీడు పట్టణం నందు మండల చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వైపు వెళుతుండగా, నా ప్యాంట్ జేబు నందు కల నా యొక్క ఒరిజినల్ పాస్ పోర్ట్ పోయినది. ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

**పంద్రంగి నీరజ్ పవన్ కుమార్**
S/o.కృష్ణమోహన్, డోర్ నెంబర్ 24 - 112
కోనేరు పేట, నియర్ టిటిడి కళ్యాణమండపం
నూజివీడు పట్టణం. ఫోన్ నెం: 9014739556

**మహారాజశ్రీ అనకాపల్లి అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**E.P. 43/2023 in O. S. 124/2017**

బిట్వీన్ : బోను ఆనందకుమార్ ... పిటీషనర్/DHR
అండ్: వై.శేషరత్నం వగైరాలు . . . రెస్పాండెంట్లు / JDRS

**1,2,3 JDRSలకు నోటీసు**

1.వై.శేషరత్నం, భర్త లేటు ఆంధ్ర మోహన్ ధయానిధి, హిందూ, వయస్సు 40 సం॥లు, C/o. యమజాల శేషారత్నం, భర్త లేటు మోహన్ ధయానిధి, ఇంటి నెం.1-7-4, MIG-175, హౌసింగ్‌బోర్డు కాలనీ, తాడేపల్లి గూడెం, వెస్ట్ గోదావరి జిల్లా.
2.ఎ.పవిత్రశ్రీ, D/o. లేటు ఆంధ్ర మోహన్ ధయానిధి, హిందూ, వయస్సు 16 సం॥లు, -డిటో-
3.ఎ.సాకేత్, S/o. లేటు ఆంధ్ర మోహన్ ధయానిధి, హిందూ, వయస్సు 11 సం॥లు, -డిటో-

పై నెంబరు. ఇ.పి. 43/2023లో పై కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **తే:27-3-2025దీకి** వాయిదా వేసియున్నారు. కావున ఆరోజు **ఉదయం 10-30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేక మీ తరపున లాయరుగారు గాని పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనిచో మీ పరోక్షమందు పై నెంబరు ఇ.పి. తీర్మాణించబడును.

**వి.రాజశేఖర్**
అడ్వకేట్, అనకాపల్లి

**Public Notice**
**In The Court Of The 2 Addl District And Sessions Judre West Godavari : Eluru**
**M.V.O.P. No. 415/2024**

*Between:*
Gonnuri Surya Chandrarao @ Chandrayya ...Petitioner
*And*
Amarulla Syed & ors ...Respondents

Whereas, the petitioner has filed petition for claiming compensation on account of the injuries sustained by him in a motor accident, whereas the Hon`ble Court ordered notice to you and posted the matter for your appearance. Therefore, you are called upon to appear before the Hon`ble Court **on 16-04-2025 at 10-30 A.M.**, else the matter will be decided in your absence.

**PYDI VENKATA RAJU,**
Dt. 17-03-2025. Advocate, Eluru.
Eluru Cell: 98851 99811

**CHANGE OF NAME**

**SHAIK AHMMAD ALI** (Old name), S/o.SHAIK EBRAHIM, D.NO: 3-27, MAIN ROAD, PENUGONDA Village, PENUGONDA Mandal, West Godavari District, Pincode-534320, I have changed my name as **SHAIK AHAMMAD ALI** (New Name), hereafter my name is known as **SHAIK AHAMMAD ALI** (New Name).

**పురపాలక సంఘ కార్యాలయము, తణుకు**

ఆర్.ఓ.సి.నెం.47/2024 - ఎ1 **తణుకు పురపాలక సంఘము** తేదీ: 18-03-2025

**2025-2026వ సంత్సరములో రోడ్డు మార్జిన్లు రోజు వారి మార్కెట్టు, ఆదివారం మార్కెట్టులలో ఆశీలు వసూలు చేసుకొను హక్కు బహిరంగ వేలం నోటీసు**

తణుకు పురపాలక సంఘ ఏరియాలోని రోడ్డు మార్జిన్లు రోజు వారి మార్కెట్టు, ఆదివారం మార్కెట్టు మరియు కొత్తగా విలీనమైన పైడిపర్రు, వెంకట్రాయపురం, వీరభద్రపురంతో కలిపి 2025-2026 సంవత్సరమునకు అనగా ది.01.04.2025 నుండి ది.31.03.2026 ఆశీలు ఫీజులు వసూలు చేసుకొనె హక్కు గజిట్ నెం.26 ది.15.03.2024 లోని షరతులు ప్రకారము తేది.21-03-2025, శుక్రవారం, ఉదయం గం.11.30 ని.లకు తణుకు పురపాలక సంఘ కార్యాలయము నందు శ్రీకమిషనరు గారిచే గాని లేక వారి అనుమతి పొందిన ఇతర అధికారిచే గాని బహిరంగ వేలం నిర్వహించబడును. ఏ కారణము చెప్పకనే పాటను ఆమోదించుట గాని లేక వాయిదా వేయుటకు గాని, లేక తిరస్కరించుటకు గాని, ఈ దిగువ సంతకముదారునికు పూర్తి అధికారము కలదు. బహిరంగ వేలంలో పాల్గొనదలచిన వారు పురపాలక సంఘమునకు ఎటువంటి బకాయిలు ఉండరాదు మరియు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవలెను. మిగిలిన విషయములు, పాట షరతులు పురపాలక సంఘములో ఆఫీసు పని దినములలో అడిగి తెలుసుకొనవచ్చును.

| వ. నెం. | పాట వివరములు | పాట సమయములో చేయవలసిన ధరావత్తు | పాట సమయములో చెల్లించవలసిన స్టాంపు డ్యూటి డిపాజిట్టు | దాఖలు చేయవలసిన సాల్వెన్సీ మొత్తము |
|---|---|---|---|---|
| 1. | రోడ్డు మార్జిన్లు రోజు వారి మార్కెట్టు, ఆదివారపు సంత మరియు మార్కెట్టు నందు 2025-26 సంవత్సరమునకు (ది.01.04.2025 నుండి ది.31.03.2026 వరకు) కాలమునకు ఆశీలు వసూలు చేసుకొనే హక్కు | రూ.5,00,000/- | రూ.1,50,000/- | రూ.5,00,000/- |

కేంద్ర ప్రభుత్వ జి.ఎస్.టి. నోటిఫికేషన్ నం.12/2015 ది.28.05.2017 ప్రకారము మార్కెట్టు పాట విలువపై 18% జి.ఎస్.టి. పాటదారుడే చెల్లించవలెను.

**సం/- కమీషనరు, తణుకు పురపాటక సంఘము.**

**ప్రకటన**
**మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో**
**O.S.No.21/2024**

వాద్లు : బోరా స్వాతి & 3 అదర్స్
Vs
ప్రతివాదులు :
కిలారి వెంకటేశ్వర్లు & 10 అదర్స్
To.
**D3** : Kilari Chandu, S/o.Venkateswarlu, D.No.5-7, Penumadam Village, Poduru Mandal, W.G.Dt. Cell: 9704760038.

పై నెంబరు దావాలో నరసాపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారు దావా సమన్లు అమలు నిమిత్తం మీకు ఎన్నిపర్యాయములు దావా సమన్లు పంపినప్పటికిన్ను మీరు ఉద్దేశ్యపూర్వకంగా దావా సమన్లు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ దావాలోని దావా సమన్లు ఈ పేపరు ప్రకటన ద్వారా అమలు చేయడమైనది. కాబట్టి మీరు **ది.3-4-2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టులో మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కాబడి మీ యొక్క వాదనను దాఖలు చేసుకొనవలసిందిగా లేని యెడల మీకు పరోక్షముగా కోర్టు వారు తీర్మానము చేయుదురు.

**పస్తుల సింహాచలం,**
**దొంగ సుభాష్‌బాబు,** అడ్వకేట్స్,
నరసాపురం నరసాపురం, ప.గో.జిల్లా.
ది.17-3-2025 సెల్: 9440467479.

**ప్రకటన**
**మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో**
**I.A.No.282/2024 in O.S.No.21/2024**

పిటీషనర్లు / వాదులు : బోరా స్వాతి & 3 అదర్స్
Vs
రెస్పాండెంట్లు/ప్రతివాదులు :
కిలారి వెంకటేశ్వర్లు & 10 అదర్స్
To.
R3 : Kilari Chandu, S/o.Venkateswarlu, D.No.5-7, Penumadam Village, Poduru Mandal, W.G.Dt. Cell: 9704760038.

పై నెంబరు దావాతో పాటు, I.A.No.282/2024 పిటీషనులో మీ పై Injunction Grant చేయవలసిందిగా దాఖలు చేయగా ది.8-5-2024వ తేదీన మహారాజశ్రీ కోర్టు వారు Temporary Injunction Grant చేసియున్నారు. అందలి IA పిటీషనరు యొక్క నోటీసులు అమలు నిమిత్తం మీకు ఎన్నిపర్యాయములు నోటీసులు పంపినప్పటికిను మీరు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున పై నెంబరు దావాలో ఈ పిటీషను నోటీసులు ఈ పేపరు ప్రకటన ద్వారా అమలు చేయడమైనది. కాబట్టి మీరు **ది.3-4-2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టులో మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు కాబడి మీ యొక్క వాదనను దాఖలు చేసుకొనవలసిందిగా లేని యెడల మీకు పరోక్షముగా కోర్టు వారు తీర్మానము చేయుదురు.

**పస్తుల సింహాచలం,**
**దొంగ సుభాష్‌బాబు,** అడ్వకేట్స్,
నరసాపురం నరసాపురం, ప.గో.జిల్లా.
ది.17-3-2025 సెల్: 9440467479.

**మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో**
**I.A. No. 742/2023**
**O.S. No. 185/2018**

*Between:*
సాధనాల నాగరాజా కుమార్ ...పిటిషనర్/3rd పార్టీ
అండ్
వానచర్ల అరుణకుమారి వగైరా ...రెస్పాండెంట్స్
టూ:
2వ Respondent:
గూడూరి యామిని, భర్త: ప్రవీణ్ కుమార్, జెట్టిపాలెం గ్రామం, మొగల్తూరు మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో పిటిషనర్ని ప్రతివాదిగా చేర్చమని కోరుచూ పై శ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో పై నంబరు పిటిషను దాఖలు చేసియున్నారు. సదరు దావాలో దాఖలు చేసిన పై నెంబరు పిటిషన్లో శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం 2వ Respondent అయిన మీకు త్రు కోర్టు ద్వారా మరియు రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినను తీసుకోకుండ కాలయాపన చేయుచున్నందున, శ్రీకోర్టు వారు ప్రత్యామ్నాయ సర్వీస్ అయిన పేపర్ ప్రకటన ద్వారా నోటీసులు పంపించమని ఉత్తర్వులు ఇస్తూ **ది. 24-03-2025 తేదికి** వాయిదా వేసియున్నారు. కావున 4 మరియు 5 Respondents అయిన మీకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది. ఏమనగా **ది.24-03-2025 తేదిన ఉదయం 10:30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి, ఏమైన ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్పు చెప్పబడును అని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

**శ్రీ అడబాల సుబ్రహ్మణ్యం** B.Com. B.L.,
నరసాపురం అడ్వకేట్,
ది. 10-03-2025 నరసాపురం, ప.గో.జిల్లా

**In the Court of the 9th Additional District Judge, Kovvur**
**I.A. No. 96/2024, O.S. No. 31/2015**

శ్రీ మాదాల ఉదయ్ కిరణ్ *-పిటీషనర్/ వాది*
మరియు
శ్రీమతి దండమూడి అనురాధ వగైరా *-రెస్పాండెంట్స్/ ప్రతివాదులు*

*To:*
*4వ రెస్పాండెంట్:* కాకర్ల వెంకటరత్నం, భర్త: వేణుగోపాలరావు, వయస్సు 57, గృహిణి, భారతి రెసిడెంటల్ స్కూల్, శాంతినగర్, ఏలూరు, ఏలూరు జిల్లా.
*7వ రెస్పాండెంట్:* వట్టికూటి వినీల, భర్త: వెంకట రామారావు, వయస్సు 37, గృహిణి, కొమ్ముగూడెం, తాడేపల్లిగూడెం మండలం, పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు పిటిషన్‌లో I.A. No. 96/2024 in O.S. No. 31/2015 పిటిషన్ సంగతులు తెలియజేయు నిమిత్తం 4 మరియు 7వ రెస్పాండెంట్స్‌కు నోటీసు సంగతులు తెలియజేయు నిమిత్తం శ్రీ కోర్టు వారి ద్వారాను మరియు రిజిస్టర్ పోస్టు ద్వారాను ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినప్పటికి సదరు 4 మరియు 7వ రెస్పాండెంట్స్ బుద్ధిపూర్వకముగా avoid చేయుచున్న కారణంగా శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు ప్రకారం పేపరు ప్రచురణ ద్వారా I.A. No. 96/2024 in O.S. No. 31/2015 నోటీసు సంగతులు తెలియజేయడమైనది. పై నెంబరు పిటిషన్‌లో మీకు ఏవైనా అభ్యంతరములు ఉన్న ఎడల **ది. 26-03-2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు** శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల తెలియపర్చుకోవచ్చును. లేని యెడల వారి పరోక్షమున తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

*వాయిదా: 26-03-2025*

**ఆత్మూరి సత్యనారాయణ**
వాది తరపు అడ్వకేటు
కొవ్వూరు కొవ్వూరు, తూ॥గో॥జిల్లా
ది.18-03-2025 సెల్: 98498 47197